# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-10-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విజయవాడ ఉత్సవ్ నగర పర్యాటక రంగ అభివృద్ధికి, స్థానిక కళాకారుల ప్రోత్సాహానికి దోహదపడుతుందని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు.**

2. **స్థానిక సంస్థల ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పంపిణీ బాధ్యత ఎన్నికల అధికారులదేనని రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.**

3. **అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు.**

4. **భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య అయిదో టీ20 మ్యాచ్ ఈరోజు రాత్రి జరగనుంది.**

===========================

విజయవాడ ఉత్సవ్ నగర పర్యాటక రంగ అభివృద్ధికి, స్థానిక కళాకారుల ప్రోత్సాహానికి దోహదపడుతుందని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0లో ఆయన ముఖ్య అతిథిగా నిన్న పాల్గొన్నారు. పది రోజుల పాటు రెండు ప్రాంగణాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఉపసభాపతి రఘురామకృష్ణరాజు పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

------------------------

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పంపిణీ బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లలో రిటర్నింగ్ అధికారులు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికల అధికారులదేనని రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ పేపర్లు ముద్రించి పంపిణీ చేయాలని ఆదేశించారు.

------------------------

విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాల స్వీకరణకు కంట్రోల్ రూంను ప్రారంభించినట్లు ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. టెలిఫోన్ నంబర్లు (0866) 2490023/2490024/2490025/ 2490026కి ప్రజలు ఫోన్ చేసి ఫిర్యాదులు, సూచనలు తెలపొచ్చని చెప్పారు. ఈమెయిల్ ఐడీ secy.apsec1@gmail.com/ secy.apsec2@gmail.com, website: sec.ap. gov.inకి

కూడా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు.

---------------------------

వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి చెరుకూరి శ్రీధర్ తెలిపారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులు, అనుచరులు గుంపులుగా చేరకుండా నిబంధనలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఎన్డీఏ కూటమిలోని జనసేన పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను ఈరోజు ప్రకటించింది. మొత్తం రెండు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థులు, 12 మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు జనసేన చేసింది.

మరో వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాలో ఆరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థులు, పది మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థులు, ఏడు నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులను ప్రకటించింది.

---------------------------

అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు. పేదరికం, ఆకలి, హింసతో బాధపడుతున్న వారికి సంఘీభావం ప్రకటిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబరు 17వ తేదీన ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1987 అక్టోబరు 17వ తేదీన ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ట్రోకాడెరో వద్ద లక్ష మందికి పైగా ప్రజలు సమావేశమై, పేదరికం మానవ హక్కుల ఉల్లంఘనగా ప్రకటించారు. పేదల హక్కులను గౌరవించి, పరిరక్షించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో 1992 డిసెంబరు 22వ తేదీన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అక్టోబరు 17వ తేదీని అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవంగా ప్రకటించింది.

---------------------------

భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా చివరి టీ20 మ్యాచ్ ఈరోజు ప్రారంభం కానుంది. బెంగుళూరులోని చిన్నస్వామి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా రాత్రి ఏడు గంటలకు మ్యాచ్ మొదలవుతుంది. ఇప్పటి వరకు జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో భారత్, వెస్టిండీస్ చెరో రెండు మ్యాచ్‌లు గెలిచాయి. ఈ రాత్రికి జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు సిరీస్ కైవసం చేసుకుంటుంది.

---------------------------

ప్రపంచ ట్రోమా దినాన్ని ఈరోజు పాటిస్తున్నారు. గాయాలయిన సందర్భంలో తగిన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదముందనే అంశంపై అవగాహన కల్పించేందుకు ట్రోమా డే నిర్వహిస్తున్నారు. మన దేశంలో 2011 నుంచి ట్రోమా దినాన్ని నిర్వహిస్తున్నారు. 'గాయాలను నిర్లక్ష్యం చేయడమేఅంగవైకల్యానికి, మరణానికి కారణమని' ప్రపంచ ఆరోగ్య సంస్థ–డబ్ల్యూ.హెచ్.ఓ. పేర్కొంది.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో

భాగంగా ఈ రోజు శ్రీ కనక దుర్గమ్మ వారు మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ పెరగడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఉదయం మలయప్పస్వామి వారు హనుమంత వాహనంపై కోదండ రాముని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుస్సు, బాణం ధరించి, హనుమంతునిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహనం ముందు భక్త బృందాలు భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ వైభవంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

---------------------------

మహర్నవమి సందర్భంగా ఈ నెల 19వ తేదీ సోమవారం సాధారణ సెలవు దినంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2026 సంవత్సరానికి సంబంధించి ఇది వరకు విడుదల చేసిన ప్రభుత్వ సెలవు దినాల జాబితాలో మహర్నవమి లేకపోవడంతో రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి విజ్ఞప్తి మేరకు సోమవారం సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆ రోజు సెలవు ఇస్తున్న నేపథ్యంలో దానికి బదులుగా.. నవంబరు 14వ తేదీ రెండో శనివారం సెలవును రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.

---------------------------

విజయవాడ ఉత్సవ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు భారత్‌లోని చైనా రాయబారి జు.ఫీహాంగ్ గత రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఆయన ఈరోజు సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాలకు సంబంధించిన ద్వైపాక్షిక అంశాలపై వారు చర్చిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో సమగ్ర వస్త్ర గణన 2026-27 నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ చేపడుతున్న దేశ వ్యాప్త గణనలో భాగంగా రాష్ట్రంలో కూడా ప్రణాళిక, సమన్వయం, పర్యవేక్షణ, సమాచార నాణ్యతను నిర్ధారించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

తమిళనాడుపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న మరో ఉపరితల ఆవర్తనం విస్తరించి కొనసాగుతుందని వాతావరణ కేంద్రం అధికారి సి. హెచ్. నాగభూషణం పేర్కొంటూ...

..వాయిస్.. 25 సెకన్లు

దక్షిణ కోస్తా, దాని పరిసర ప్రాంతాలపై ఉన్నఉపరితల ఆవర్తనం నుండి వాయువ్య బంగాళాఖాతం వరకు ద్రోణి విస్తరించి ఉందని, వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాంలలో ఈరోజు భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది.

=====================